క్లుప్తంగా

నష్టపరిహారం అందించాలని వినతి

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం పొలం సర్వేనంబర్ 109–5లో 0–77 సెంట్లలోని మామిడి చెట్లకు నిప్పు అంటుకుని నష్టపోయామని, పరిహారం అందించి తమకు న్యాయం చేయాలని రైతు శివప్ప డిప్యూటీ తహసీల్దార్ కుమార్‌స్వామిరెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. 2015–16 సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద మామిడి సాగు చేశానని, తోట చుట్టూ ముళ్లకంపలను వేసి కాపాడుకున్నానని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

మోడల్ స్కూల్‌లో చేరండి



మద్దనకుంటలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అమరాపురం: మండల పరిధిలోని హలుకూరు గ్రామ సమీపంలో ఉన్న ఏపీ మోడల్ పాఠశాలలో 2025 –26 సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఉపాధ్యాయుడు సత్యం తెలిపారు. మండలంలోని మద్దనకుంట, ఉదుగూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలతో పాటు విద్యార్థుల ఇంటి వద్దకు వెళ్లి మోడల్ పాఠశాలలో చేరాలని అర్హత కలిగిన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. అలాగే మధ్యాహ్న భోజనం, క్రీడల్లో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ప్రైవేటు పాఠశాలల కంటే మెరుగ్గా బోధిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపు ప్రారంభం



ఆర్ అనంతపురంలో క్యాంపును ప్రారంభిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపును సోమవారం ఆర్ అనంతపురంలో కళాశాల అసోసియేట్ డీన్ సరోజినీదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్య, సామాజిక సేవా కార్యక్రమాలపై యువత ఆసక్తి పెంచుకుని ముందుకెళ్లాలన్నారు. గ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టి గ్రామాభివృద్ధికి సహకారం అందించాలన్నారు. వారం రోజుల పాటు పంచాయతీలో నిర్వహించే ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపునకు అందరూ సహకారం అందించాలన్నారు. అనంతరం గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు శ్రమదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అంజినమ్మ, అధ్యాపకులు డాక్టర్ మురళీకృష్ణ, సుమతి, మంజుల, కిశోర్, రాఘవేంద్ర, పీడీ రమేష్, హెచ్‌ఎం రమాప్రియ, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

గుండెపోటుతో చిరుద్యోగి మృతి



మంజునాథ్ (ఫైల్)

పావగడ: స్థానిక తాలూకా కార్యాలయంలోని సర్వే డిపార్ట్‌మెంట్‌లో తాత్కాలిక ఉద్యోగిగా విధులు నిర్వహించే మంజునాథ్ (32) గుండెపోటుతో సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య మంజుల ముగ్గురు కుమార్తెలు, అంగవైకల్యంతో చక్రాల కుర్చీకే పరిమితమైన 13 ఏళ్ల కుమారుడు ఉన్నారు. మంజునాథ్ మృతికి సర్వే డిపార్ట్‌మెంట్ ఉద్యోగులు, సిబ్బంది సంతాపం తెలిపారు.

నేటి నుంచి ప్రత్యేక కోచింగ్

అగళి: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న, చేయబోయే విద్యార్థులకు పరీక్షకు సన్నద్ధం చేసేందుకు ప్రత్యేక కోచింగ్ క్లాసులు ఇవ్వనున్నట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ జాఫార్ తెలిపారు. మార్చి 11వ తేదీ నుంచి 25వ తేదీ వరకూ ప్రత్యేకంగా తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రోజూ సాయంత్రం నాలుగు గంటల నుంచి 5 గంటల వరకు తరగతులు ఉంటాయన్నారు.

తుంగభద్ర నీటి పైప్ ధ్వంసం



పైప్ పగలడంతో నీరు వృథా అవుతున్న దృశ్యం

పావగడ: పావగడ ప్రజల దాహార్తి తీర్చడానికి తుంగభద్ర డ్యాం నుంచి పావగడకు ఏర్పాటు చేసిన నీటి పైప్ గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. తాలూకా వ్యాప్తంగా ఓ ప్రైవేట్ కంపెనీ కేబుల్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా జేసీబీలతో రోడ్డుకు ఒక వైపు గుంతలు తవ్వే పనులు చేస్తోందని, దీంతో రోడ్డుకు ఆనుకుని వేసిన నీటి పైపులు పగిలిపోతున్నాయని ఇంజినీయర్ బసవలింగప్ప ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంబంధిత కాంట్రాక్టర్ల పైన ఫిర్యాదు చేశారు. అయినా కేబుల్ నిర్వాహకులపై పోలీసులు ఎలాంటి చర్యలు చేపట్టడంలేదన్న ఆరోపణలున్నాయి.

వలస కార్మికుల వ్యథ !

- జీతాలు చెల్లించని స్టీల్ ఫ్యాక్టరీ యాజమాన్యం
- పనికి కుదిర్చిన కాంట్రాక్టర్ కనిపించని వైనం
- రోడ్డున పడిన కార్మికులు
- న్యాయం చేయాలంటూ వేడుకోలు



వివిధ రాష్ట్రాలకు చెందిన వలస కార్మికులు

హిందూపురం: వారంతా రాష్ట్రాలు దాటి పొట్టకూటి కోసం వచ్చి కష్టించి పనిచేస్తున్నారు. అయితే చేసిన కష్టానికి ఫలితంగా అందాల్సిన వేతనం చేతికి అందకపోవడంతో రోడ్డున పడ్డారు. పనికి కుదిర్చిన వ్యక్తి కనిపించక.. జీతాలు ఇవ్వాల్సిన యాజమాన్యం పట్టించుకోకపోవడంతో తమ బాధ ఎవరికి చెప్పుకోవాలో తెలీక అల్లాడిపోతున్నారు.

కాంట్రాక్టర్ ఉంటేనే జీతాలు ఇస్తాం..

హిందూపురం సమీపంలోని తూమకుంట పారిశ్రామిక వాడలో వందలాది పరిశ్రమలు నడుస్తున్నాయి. స్థానికులే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా కార్మికులను రప్పించి పనిచేయిస్తుంటారు. ఈ నేపథ్యంలోనే గోళాపురం వద్ద ఉన్న ఓస్వెల్ స్మెల్టర్స్ స్టీల్ ఫ్యాక్టరీలో బీహార్, యూపీ, ఒరిస్సాలకు చెందిన 38 కార్మికులను తరుణ్ అనే కాంట్రాక్టర్ పనికి కుదిర్చారు. అనంతరం ఇతర పనుల నిమిత్తం అతను భువనేశ్వర్ వెళ్లిపోయాడు. వలస కార్మికులందరూ రోజూ కష్టపడి పనిచేస్తున్నారు.

నిలువ నీడలేక...

గత నాలుగు నెలలుగా స్టీల్ ఫ్యాక్టరీ యాజమాన్యం జీతాలు చెల్లించకపోవడంతో కార్మికులు పడరాని పాట్లు పడుతున్నారు. నేరుగా మీకు వేతనాలు ఇవ్వలేము.. మీ కాంట్రాక్టర్ ఇక్కడికి వస్తేనే ఇస్తామంటూ పేచీ పెట్టారు. నాలుగు నెలలు గడుస్తున్నా కాంట్రాక్టర్ ఇక్కడి రాక.. ఫ్యాక్టర్ యాజమాన్యం జీతాలు ఇవ్వకపోవడంతో కార్మికులు రోడ్డున పడ్డారు. వారు బాడుగకు ఉన్న షెడ్ల నిర్వాకులు బాడుక ఇవ్వకపోవడంతో వారిని బయటకు నెట్టేశారు. ఎక్కడా అప్పు పుట్టక.. ఉండేందుకు నిలువ నీడ లేక వారంతా పస్తులు ఉండాల్సిన దుస్థితి నెలకొంది. వలస కార్మికుల ఇబ్బందులు తెలుసుకున్న కార్మిక సంఘ నాయకులు రవి, ఇతర సభ్యులు వలస కార్మికులతో కార్మికశాఖ కార్యాయంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. కార్మికులను న్యాయం చేయాలని అధికారులను కోరడంతో న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

అందరం రోడ్డున పడ్డాం



ఇక్కడి స్టీల్ ఫ్యాక్టరీలో మూడు నెలలకుపైగా పనిచేస్తున్నా ఫ్యాక్టరీ యాజమాన్యం జీతాలు చెల్లించడం లేదు. మమ్మల్ని పిలిపించిన కాంట్రాక్టర్ తరుణ్‌కు ఫోన్ చేసినా మాట్లాడటం లేదు. బాడుగకు ఉన్న షెడ్ల నుంచి వాటి నిర్వాహకులు బయటకు తరిమేశారు. దుకాణదారులు అప్పుగా రేషన్ ఇవ్వడంలేదు. మేమందరమూ రోడ్లుపై వచ్చేశాం. లేబర్ అధికారులకు ఫిర్యాదు కూడా చేశాం. త్వరగా మాకు న్యాయం చేయాలని కోరుతున్నాం.

– విజయ్‌రామ్, బీహార్

పస్తులు ఉంటున్నాం



మూడునెలలుగా తిండి తిప్పలకు ఇబ్బంది పడుతున్నాం. మేమే పస్తులుంటున్నాం మా ఊళ్లో కుటుంబాలకు ఇంక ఏం పంపాలి. వారి జీవనం కూడా దుర్భరంగా మారింది. కూలి పనులు చేసుకునే మాలాంటి కార్మికులకు వేతనాలు ఇవ్వకపోతే ఎలా బతకగలం. తినడానికి, ఉండటానికి అన్నింటికి చాలా ఇబ్బంది పడుతున్నాం. పనులు చేసి కూడా పస్తులు ఉండాల్సి పరిస్థితి. మా దయనీయ పరిస్థితులు చూసైనా న్యాయం చేయండి.

– రాజ్‌కుమార్ గుప్తా, యూపీ

చేసిన పనికి జీతమివ్వకపోతే ఎలా?



వలస కార్మికులు కష్టపడి పనిచేసినా జీతాలు ఇవ్వకుండా వేధించడం దారుణం. కాంట్రాక్టర్ లేకపోతే ఏంటి? కష్టపడిన వారికి నెలసరి జీతం ఇవ్వాల్సిందే. కాంట్రాక్టర్ వస్తేనే జీతాలిస్తామని పేచి పెట్టడం సరికాదు. కార్మికులు రోడ్డుపడినా యాజమాన్యానికి కనిపించడం లేదా? తక్షణమే కార్మికులకు జీతాలు ఇవ్వాలి. అలాగే రక్షణ సదుపాయం ఫ్యాక్టరీ యాజమాన్యమే కల్పించాలి.

– రవికుమార్,
కార్మిక సంఘం అధ్యక్షుడు, తూమకుంట పారిశ్రామికవాడ

ఉత్తమ ప్రతిభకు అవార్డు



మడకశిర: అక్షతను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మడకశిరరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు గత ఏడాది డిసెంబర్ 22న వదన్య సంస్థ నిర్వహించిన టాలెంట్ టెస్టులో మండలంలోని రేకులకుంట ఉన్నత పాఠశాలలో 9 వతరగతి చదువుతున్న అక్షత ప్రతిభ చూపింది. మండల టాపర్‌గా నిలవడంతో అవార్డు, ప్రశంసాపత్రాన్ని అందుకున్నట్లు హెచ్‌ఎం గిరిజ తెలిపారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.

అగళి: మండల పరిధిలోని మధూడి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ప్రణీత్‌కుమార్ ఇటీవల జరిగిన వదన్య టాలెంట్ టెస్టులో ప్రతిభ చూపి మండల టాపర్‌గా నిలిచాడు. దీంతో ప్రభుత్వ బాలుర వసతి గృహం వార్డెన్ సికిందర్ బాషాతో పాటు విద్యార్థులు ప్రణీత్‌ను అభినందించారు.

పెనుకొండ రూరల్: మండలంలోని గుట్టూరు హైస్కూల్‌కి చెందిన మౌనశ్రీ వదన్య టాలెంట్ టెస్టులో మండల టాపర్‌గా నిలిచింది. దీంతో ప్రధానోపాధ్యాయుడు నాగార్జునుడు, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

15లోపు ఈ-కేవైసీ చేయించుకోండి

అమరాపురం: మండలంలోని ప్రభుత్వ చౌక ధాన్యపు డిపో వద్ద బియ్యం కార్డు లబ్ధిదారులు ఈ–కేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణ తెలిపారు. ప్రభుత్వం ఈ నెల 15వ తేదీ వరకూ నిత్యావసర సరుకులు తీసుకునే వారికి వేలిముద్రలను ఆన్‌లైన్‌లో అనుసంధానం చేయాలని ఆదేశాలిచ్చినట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యువత పోరును విజయవంతం చేయండి

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, నాయకులు, కార్యకర్తలు

మడకశిర: ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యార్థులు, నిరుద్యోగులను అన్ని విధాలుగా మోసం చేశారని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప విమర్శించారు. విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి మంజూరు ఇవ్వకుండా నిండాముంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి యువతపోరు పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈరలక్కప్ప మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగులను మోసం చేసిన కూటమి ప్రభుత్వ కళ్లు తెరిపించేందుకే ఈనెల 12న (బుధవారం) ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలో నిరసన ర్యాలీ, ధర్నా చేస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి రాగానే హామీని తుంగలో తొక్కారని విమర్శించారు. విద్యార్థులకు పూర్తిస్థాయిలో ఫీజురీయింబర్స్‌మెంట్ ఇస్తామని చెప్పి మోసం చేశారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా అన్ని వర్గాలకు అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. యువత పోరుకు విద్యార్థులు, నిరుద్యోగులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కుంచిటి వక్కలిగ విభాగం అధ్యక్షుడు రంగేగౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి సత్యనారాయణయాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, మండల కన్వీనర్ రామిరెడ్డి, కౌన్సిలర్లు అన్సర్, విక్రమ్, వైఎస్సార్‌సీపీ నాయకులు సత్యనారాయణయాదవ్, తిమ్మప్ప, కరియన్న, రంగనాథ్, నాగభూషణ్‌రెడ్డి, అంజలి, శేషాద్రి, నగేష్, తిప్పేస్వామి, బాలకృష్ణారెడ్డి, దేవరాజు, నరసింహ, సతీష్, రవీంద్రరెడ్డి, దొడ్డయ్య, సికిందర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ఈ నెల 12వ తేదీన జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో నిర్వహించే యువత పోరుకు మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, మహిళా సంఘాల సభ్యులు తప్పక హాజరు కావాలని మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్, ఎంపీపీ ఈరన్న ఓ ప్రకటనలో కోరారు.

గుడిబండ: విద్యార్థులు, నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం చేసిన మోసాన్ని ఎండగడుతూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 12న (బుధవారం) చేపట్టనున్న యువత పోరును జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల పార్టీ నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

మహిళా లోకానికి దిక్సూచి సావిత్రిబాయి



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

గుడిబండ: విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యమని నమ్మి మహిళల్లో చైతన్యం తీసుకువచ్చి చదువుకునేలా ప్రోత్సహించిన సావిత్రిబాయి పూలే మహిళా లోకానిక దిక్సూచి అని ఎంజేపీ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ అన్నారు. సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా సోమవారం ఎంజేపీ బాలికల కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రసాద్ మాట్లాడుతూ మహిళల హక్కుల సాధనలో సావిత్రిబాయి కీలక పాత్ర పోషించారన్నారు. ఆమె భావాలు, ఆశయాలు ముందుకు తీసుకెళ్లాల్సి బాధ్యత నేటి విద్యార్థులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనురాధ, ప్రమీల, లలిత, శ్రీనివాసులు, శివలింగప్ప, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: మండల పరిధిలోని జిల్లెడుగుంట ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం సావిత్రిబాయి పూలే వర్ధంతి, మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం భూతన్న మాట్లాడుతూ తన జీవిత కాలం బడుగు, బలహీన వర్గాల విద్య, సామాజిక కార్యక్రమాలు చేపట్టారన్నారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కరియన్న, సుధారాణి, ఇందిరమ్మ, లలితమ్మ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

మడకశిర: పట్టణంలోని పాత ఎస్సీ కాలనీలో ఆదివారం రాత్రి పరస్పరం దాడులు చేసుకున్న ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ట్రైనీ డీఎస్పీ ఉదయపావని, సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. అశ్వత్థకట్ట విషయంలో ఇరువర్గాలు మరణాయుధాలతో దాడులు చేసుకున్నట్లు పేర్కొన్నారు. పాత ఎస్సీ కాలనీకి చెందిన తలమర్ల రామాంజినేయులు వర్గీయులు, కెంచప్ప వర్గీయులు దాడులు చేసుకున్నట్లు చెప్పారు. వారిపై దొమ్మి, హత్యాయత్నం కేసు నమోదు చేశామన్నారు. వారిని వెంటనే అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చామన్నారు.

హిందువులపై దాడులు అరికట్టాలి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్: రాయచోటిలో హిందువులపై జరిగిన దాడిని ఖండిస్తూ బీజేపీ, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక మిట్ట ఆంజనేయస్వామి దేవాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ జరిగింది. హిందువులపై దాడులను అరికట్టాలని, అక్రమ కేసులను తొలగించి రాయచోటి ఎస్‌ఐని సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలోని ఏఓ గిరిధర్‌కు వినతిపత్రం ఇచ్చారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షపై అవగాహన

అగళి: భూసార పరీక్షలతో ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతున్న రసాయనిక ఎరువుల వినియోగంపై నియంత్రణ సాధించవచ్చని ఏఓ శేఖర్ నాయక్ పేర్కొన్నారు. మండల పరిధిలోని రైతు సేవ కేంద్రములో భూసార పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భూసార పరీక్షలు చేయించుకుని వాటి ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగిస్తే సాగు పెట్టుబడి తగ్గించడమే కాకుండా పంట దిగుబడి పెంచవచ్చన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రొద్దం: మండల పరిధిలోని నల్లూరుకు చెందిన పూల ఓబుళేసు (49) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఇటీవల ఇంటి వద్ద కిందపడి తలకు బలమైన గాయలు కావటంతో కోమాలోకి వెళ్లాడు. అప్పటి నుంచి వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందినా ఫలితం లేకపోయిందని మృతుడి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బస్సు సౌకర్యం కల్పించండి

మడకశిర: గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ సోమవారం డిపో మేనేజర్ రామసుబ్బయ్యకు ఎమ్మార్పీఎస్ నాయకులు వినతి పత్రాన్ని సమర్పించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు టైగర్ వన్నూర్‌స్వామి మాట్లాడుతూ సమయానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని చెప్పారు.

ధర్నా విజయవంతం చేయండి

రొద్దం: ఎనిమిది వారాలుగా బిల్లులు పడకపోవడంతో ఉపాధి కూలీలు అవస్థలు పడుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న అన్నారు. సోమవారం మండలంలోని తురకలాపట్నం సమీపంలో పనులు చేస్తున్న కూలీలను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. కూలీల సమస్యలపై ఈనెల 12న విజయవాడలో మహా ధర్నా తలపెట్టినట్లు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆదాయాన్ని పక్కదారి పట్టిస్తున్న వారిపై చర్య తీసుకోండి



గ్రీవెన్స్‌లో జేసీకి ఫిర్యాదు చేస్తున్న భీమ్ రావు భారత్ పార్టీ నాయకులు

హిందూపురం: పట్టణ సమీపంలో కొట్నూరు చెరువులో చేపలు పట్టడం పేరుతో ఒకటో వార్డు టీడీపీ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న శేఖర్ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని జై భీమ్‌రావు భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఊటుకూరు నాగరాజు విమర్శించారు. దీనిపై సోమవారం జిల్లా సచివాలయంలోని గ్రీవెన్స్‌లో జేసీ అభిషేక్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. చేపల విక్రయాలతో వచ్చిన ఆదాయాన్ని ఆలయాలకు ఇస్తామని గ్రామ ప్రజలకు చెప్పి సాగునీటి సంఘం కమిటీ సభ్యులు, గ్రామస్తులు చెరువు చేపల వేలంలో పాల్గొనకుండా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని గండి కొడుతున్నారన్నారు. ప్రజలను మభ్యపెట్టి ప్రతి ఏటా రూ.లక్షల ఆదాయాన్ని సమకూర్చుకుంటూ కేవలం రూ.40 వేలతో సరిపెడుతున్నారని విమర్శించారు. ఆదాయన్ని పక్కదారి పట్టిస్తున్న శేఖర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యం



వైఎస్సార్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రొళ్ల: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోనే సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. 12న వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం నేపథ్యంలో సోమవారం మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌కట్ చేసి స్వీట్లను పంచి పెట్టారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, జిల్లా కార్యదర్శి లోకేష్, సర్పంచులు సదాశివప్ప, హరికృష్ణ, ఎంపీటీసీ లింగరాజు, వైస్ సర్పంచ్ రవి, నాయకులు ముద్దారెడ్డి, దొడ్డయ్య, రవికుమార్, నాగభూషణ, వజీర్‌సాబ్, మధు, ఈరన్న, శ్రీధర్ పాల్గొన్నారు.

రీసర్వే పనుల పరిశీలన

రొళ్ల: మండల పరిధిలోని తూబినకుంట, అగళి మండలం అక్కగార్లదేవరహళ్లి గ్రామ సరిహద్దు ప్రాంతమైన తూభినకుంట పొలిమేర వద్ద చేపట్టిన రీసర్వే పనులను సోమవారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు, సలహాలిచ్చారు.

బాధ్యతలు చేపట్టిన మండల ఇంజినీర్

లేపాక్షి: మండల ఇన్‌చార్జి పంచాయతీ ఇంజినీర్‌గా వరప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గోరంట్ల మండలానికి రెగ్యులర్ ఇంజినీర్‌గా వ్యవహరిస్తున్నారు. అయితే ఇక్కడ పోస్టు ఖాళీగా ఉండటంతో ఇన్‌చార్జిగా కొనసాగుతారని ఎంపీడీఓ నరసింహమూర్తి తెలిపారు. అలాగే ఉపాధి హామీ పథకం కింద అడిషనల్ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా హిందూపురం మండలంలో పనిచేస్తున్న ఏపీఓ లలిత ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారన్నారు.

కేటీ హళ్లిలో జేడీఎస్ విజయభేరి

పావగడ: తాలూకాలోని కేటీ హళ్లిలో వీఎస్‌ఎస్‌ఎన్ (ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం) ఎన్నికల్లో జేడీఎస్ పార్టీ విజయభేరి మోగించింది. సోమవారం నిర్వహించిన ఎన్నికల్లో ఆరుగురు జేడీఎస్ మద్దతుదారులు విజయం సాధించారు. ఆర్ హెచ్ నాగరాజు, కేఎల్ నాగరాజు, మధూశ్, భీమయ్య, లోకేశ్, శివణ్ణ ఎన్నిక పట్ల మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, తాలూకా జేడీఎస్ అధ్యక్షుడు ఎన్‌వీ ఈరణ్ణ, తిమ్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

జాతరను విజయవంతం చేయండి

మడకశిర: పట్టణంలో ఏప్రిల్ 14 నుంచి 19 వరకూ నిర్వహించే కసుమ మారెమ్మ జాతర మహోత్సవాన్ని భక్తులు విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా ఏప్రిల్ 14న జలధి, 15న జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఈజాతర మహోత్సవాల్లో పాల్గొనాలని కోరారు. జాతర మహోత్సవానికి భక్తులు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించాలన్నారు.

జోరుగా మట్టి, ఇసుక అక్రమ రవాణా



చిలమత్తూరు: బైరేకుంట చెరువులో మట్టిని తరలిస్తున్న దృశ్యం



హిందూపురం పట్టణ పరిసరాల్లో ఇసుక ఇలా..

చిలమత్తూరు: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇసుక, మద్యం, మట్టి దందాలు పెరిగిపోయాయి. ఎలాంటి అనుమతులు లేకుండానే చెరువుల్లో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. కూటమి నేతల అండదండలతో ఇటుక బట్టీలకు వందలాది లోడ్ల మట్టిని చెరువుల నుంచి యథేచ్ఛగా తరలిస్తున్నారు. హిందూపురం సమీపంలోని పెన్నానదిలో ఇసుకను ఇష్టానుసారం తోడేస్తున్నారు. కాంట్రాక్టర్లకు ఇసుకను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

ఇంటర్ పరీక్షకు 16 మంది గైర్హాజరు

మడకశిర: నియోజకవర్గంలో సోమవారం జరిగిన ఇంటర్ పరీక్షకు 16 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు. మొత్తం 1,209 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా....1,193 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు పేర్కొన్నారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించండి

రొళ్ల: ప్రాథమిక విద్యదశ నుంచి విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని రత్నగిరి ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు.

కోట వేంకటరమణస్వామి గ్రామోత్సవం

మడకశిర: పట్టణంలో వెలసిన కోట వేంకటరమణస్వామికి సోమవారం రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. మూడు రోజుల పాటు వేద పండితులు ఆలయంలో సంప్రోక్షణ పూజలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఆ పూజలు ముగిసిన నేపథ్యంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించి వాహనంలో ఉంచి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు.